Y. RAMAKRISHNA

# క్రీనీడ

కృష్ణా బ్రిడ్జిని గజగజ వణికించేస్తూ, రైలు దూసుకుపోయింది. సుజాత కళ్లనిండా నీళ్లు గిర్రున తిరుగుతున్నాయి. వసంత యెక్కడ చూసిపోతుందో అని పమిటకొంగు చివళ్లతో కళ్ళు తుడుచుకుని, యేవో కబుర్లు చెబుతోంది. కాని మనస్సు మాత్రం అక్కడలేదు.

'అమ్మా, మనం బోలెడుదూరం వచ్చాం కాదుటే...'

సుజాత యేమీ మాట్లాడలేదు.

'అమ్మా. చెట్లన్నీ యెట్లా పరుగెత్తుకు పోతున్నాయో చూశావా...'

సుజాత తలెత్తి, వసంత మొహంలోకి చూసింది.

'అమ్మా, నాన్న మనతో రాలేదెందుకే...!'

సుజాత మొహం యెర్రబారింది.

'ఏమిటే అమ్మా...ఏమీ మాట్లాడవు. అయితే నేను వెళ్లి ఆ చివర కూర్చుంటా...' వసంత మూతి ముడుచుకుంది.

సుజాత, వసంత జుట్టు నిమురుతూ దగ్గరకు లాక్కుంది. వసంత విత్తర చూపులతో, తల్లి మొహంలోకి చూస్తోంది.

వసంతను అమాంతంగా తన హృదయానికి హత్తుకుంది సుజాత.

'అబ్బబ్బ, జెడాంతా రేగిపోయిందే..' వసంత కొంచెంగా విసుక్కుని మొహం చిటచిటలాడించింది.

'అమ్మా, మనం వూరు వెళ్లంగానే, నాన్నను రమ్మనమని వుత్తరం రాయవే...' వసంత యెంతో ప్రాధేయపడి అడిగింది.

సుజాత చటుక్కున వులిక్కిపడింది. మెదడులో యెన్నో ఆలోచనలు గిర్రున తిరిగినాయి. జరిగిన వన్నీ, ఒక్కొక్కటే జ్ఞాపకం వచ్చేస్తున్నాయి. మనస్సు కలవరపడిపోతోంది. గాభరాగా అటూ యిటూ తత్తర పాటుగా చూస్తోంది. ఒక్క క్షణం, తన మనస్సు ఆలోచించటం మానేసింది. రైలు కెవ్వున కేకపెట్టింది.

వసంత వులిక్కిపడింది. తల్లి వీపు చరిచింది.

'నేను ధడుసుకున్నా నేమిటి... నా వీపుమీద కొడతావెందుకు?' వసంత గోముగా అన్నది.

Y. RAMAKRISHNA



సుజాత బలవంతంగా నవ్వు తెచ్చుకుని, కూతురి మొహంలోకి చూసింది.

వసంతకూడా నవ్వేసింది.

'పై స్టేషన్లోనే మనం దిగాలి...' సుజాత, పైన పెట్టిన పెట్టెను మెల్లిగా క్రింద పెడదామని ప్రయత్నం చేస్తోంది.

వసంతకు ఉత్సాహం యెక్కువయి పోయింది. గంతులు వేసుకుంటూ ఆ కాస్త స్థలంలోనే తిరగటం మొదలు పెట్టింది.

రైలు వేగం చూస్తూచూస్తూండగానే తగ్గిపోతోంది. వసంత గంతులు యెక్కువయినాయి.

'మధు మామయ్య వస్తాడుటే స్టేషనుకు ?...' వంగి వంగి చూస్తోంది వసంత.

'ఏమిటా వంగటం. సరిగ్గా కూర్చో. బండీ ఆగనీ...అడుగో !...'

'మామయ్యా!!' వసంత బిగ్గరగా కేక పెట్టింది.

అప్రయత్నంగా సుజాత కళ్ళ నుండి రెండు అశ్రు బిందువులు రాలాయి.

* * *

గిరగిరా తిరిగిపోతున్నారు. వసంత భయంతో కళ్ళుమూసుకుంది. సుజాత నిబ్బరంగా కళ్ళు తెరుచుకుని చూస్తోంది. భయాన్ని వెనక్కు నెట్టేస్తూ. డాక్టరు ఉమాపతి బింకంగా నవ్వుతున్నాడు. తిరిగి తిరిగి విమానం ఆగిపోయింది. కాని కళ్ళు గిర్రున తిరిగి పోతున్నాయి. భూమంతా తిరిగిపోతోంది. వళ్ళుతూలి పోతోంది.

'అబ్బ! కాసేపు కూర్చుందురు... కళ్లు తిరిగిపోతున్నాయి...' కళ్లు గట్టిగా మూసుకుని సుజాత చతికిల పడింది. ఉమాపతి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

'అబ్బ! ఎంత భయం వేసిందని... మళ్లీ జన్మలో విమానం యెక్కుతానంటావా?' సుజాత కొంచెం కోపంగా చూసింది వసంత వైపుకు.

వసంత, మొహం చిన్నది చేసుకుని తండ్రి దగ్గరకు వెళ్ళింది. ఉమాపతి, వసంతను ఎత్తుకున్నాడు. ప్రక్కనే తూలుతూ సుజాత నడుస్తోంది.

'ఇంకా యేమిటి చూడాలిసింది చెప్పండి... ఇక్కడేమిటో సర్కసుంది చూస్తారా...'

'నాన్నా!...సర్కసు చూస్తాను నాన్నా...' వసంత సంతోషంతో అంటోంది.

'అన్నీ చూశావుగాని యింటికిపద. ఏ వేళయింది మనంవచ్చి. మన వెనకాల వచ్చినవాళ్ళు కూడా తిరిగి వెళ్ళిపోతున్నారు...' సుజాత జనాన్ని సద్దుకుంటూ, ఉమాపతి ప్రక్కనే నడుస్తూ వస్తోంది.

'నాన్నా నాన్నా...ఈ బొమ్మలు కొనవూ...'

'మళ్ళీ సంక్రాంతివరకు ఇవి వుంటాయనా !...'

'అప్పుడు మళ్ళీ కొనుక్కోవచ్చు కావాలంటే...' ఉమాపతి బొమ్మల దుకాణం దగ్గరకు వెళ్ళాడు.

వసంత తల్లివంక చూసి నవ్వింది. సుజాతకు ఉక్రోషం వచ్చింది.

'ఇంకా ఏమన్నా కావాలంటే యిప్పుడే చెప్పు. మళ్ళీ ఎగ్జిబిషన్‌కు రమ్మంటే నాకు వీలుపడదు చెపుతున్నా...' ఉమాపతి ఇద్దరివంకా చూసి అన్నాడు.

సుజాత ఏమీ మాట్లాడలేదు.

'అట్లా అవుతే' అని మొదలు పెట్టి ఏ వేవో చెప్పకు పోతోంది వసంత

తీరా యింటికి వచ్చేటప్పటికి పది గంటలయింది. ఇంటి గుమ్మంలో నలుగురు డాక్టరుగారి కోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు.

'అయ్యా డాక్టరుగారూ...రక్షించాలి...' అన్నారు.

'నంబరు 22 స్పృహతప్పి పడిపోయాడు—మిగతావి...' నర్సు అందుకుని చెప్పింది.

ఆదరాబాదరాగా ఉమాపతి డిస్పెన్సరీకి పరుగెత్తాడు. వెంటనే నర్సు మందుల పెట్టె తీసుకుని వెనకాలే వెళ్ళింది.

ఉమాపతి రోగిని పరీక్ష చేస్తున్నాడు.

నర్సు తత్తరపడిపోతూ మందులు అందిస్తోంది.

'మీ రెవ్వరూ యిక్కడ వుండక్కర్లేదు. బైట వరండాలోకి వెళ్ళి పడుకోండి. అవసరంవుంటే పిలుస్తాను...'

నర్సు ప్రక్క గదిలోకి వెళ్ళి, సోఫాలో వత్తిగిలింది. ఉమాపతి పడక కుర్చీలో పడుకుని. ఆలోచిస్తున్నాడు. తన మెదడులో ఎగ్జిబిషన్ అంతా ఒక్కసారిగా మెదలింది. తన కళ్ళల్లోకి యే మేమిటో వచ్చి మాయమయిపోతున్నాయి. తన మనస్సును కొన్ని పలకరిస్తున్నాయి. తాను కొన్నింటిని పలవరిస్తున్నాడు.తన హృదయం అంతా ఆనందంతో నిండుకుపోయింది. ఆలోచనల్లో తనకు అపూర్వ అనుభవంవుంది. తన కళ్ళల్లోకి నిద్ర వచ్చి తొంగి చూసి పోతోంది. కొంచెంగా ఆవలించి,

రోగివైపుకు చూశాడు. కొంచెం తృప్తిగా అనిపించింది. కాసేపు పడుకుందామనుకుని కుర్చీలోంచి లేచాడు.

ప్రశాంతంగా గదిలోకి వెళ్లి, సోఫాలో చేరగిలాడు. తన కళ్ళను తానే నమ్మ లేకపోయాడు. ఎదురు సోఫాలో నర్సు పడుకుని వుంది. రేగిన ముంగురులు, చెక్కిళ్ల సిగ్గును కప్పేసినాయి. పమిట కొంగు, ఎలెక్ట్రిక్ ఫాన్ గాలికి అటూ యిటూ రెపరెపలాడుతోంది. యెంతో నిరామయంగా, నిద్రపోతోంది. నర్సు.ఆమెను యింత స్పష్టంగా, ఉమాపతి అదివరకు యెన్నడూ చూడలేదు. తన మనస్సులో చెలరేగిన ఆవేశాలకు, ఆవేదనలకు, యీ నర్సు ఒక రూపును ఇచ్చినట్లయింది. రెండడుగులు ముందుకు వేశాడు.

"సిస్టర్! సిస్టర్!!" అంటూ రెండుసార్లు పిలిచాడు.

ఆమె శరీరం యెంతో చల్లగా తగిలింది. ఉమాపతి చేతికి.

"సిస్టర్!".

నర్సు త్రుళ్లిపడి లేచింది. నిలువునా నిలబడింది. ఎదురుగా డాక్టరు ఉమాపతి. పెదిమలు తడబడుతున్నాయి ఉమాపతికి.

నర్సు నిశ్చేష్టురాలై చూస్తోంది.

తన కళ్ళతో యేవో చెపుతున్నాడు ఉమాపతి.

ప్రాధేయపడుతున్నట్లు చూస్తున్నాడు.

నర్సు నిశ్చలంగా నిలబడి వుంది.

ఉమాపతంటే, నర్సుకు యిదివరలో యెంతో గౌరవం, అభిమానం. ఇప్పుడు అప్యాయత, అనురాగం కూడా ఏర్పడ్డాయి.

లైటు ఆరిపోయింది.

రోగి ఖంగున దగ్గాడు.

కోడి కొక్కొ-రోకో అంది.

*           *           *

'సుజీ!...'.

'నాన్న గారు వచ్చినటున్నారు చూడు...' సుజాత వసంతతో అంది.

'అమ్మా...నాన్నే నే...... సుజీ యేమిటి...నీ పేరు సుజాత అవుతే...' వసంత, తండ్రి కోటుజేబు సవిరిస్తోంది.

'అన్నీ నీకే కావాలే...' సుజాత లోపల్నుంచి వస్తూనే అంది.

ముగ్గురూ నవ్వుకున్నారు.

'ఏమిటి నువ్వివ్వాళ అట్లావున్నావు' ఉమాపతి సుజాత వంక చూస్తూ ఆలోచనగా అన్నాడు.

'నేనెట్లావున్నాను. మామూలుగానే వున్నాను. ఎట్లావున్నట్లు అనిపిస్తోంది మీకు...' అద్దంలో చూసుకుంటోంది సుజాత.

'నాకేమీ తెలియటంలేదు మీరే చెప్పండి యెట్లావున్నానో...' సుజాత పట్టుపట్టి అడిగింది.

'ఏమిటో నాకట్లా అనిపించింది నిన్ను చూడంగానే...' ఉమాపతి వసంత చెయ్యిపట్టుకొని మెల్లిగా లోపలికి వెళుతున్నాడు.

'ఫలహారం తీసుకువస్తా కూర్చోండి' సుజాత లోపలికి వెళ్ళింది.

ఒకే సోఫాలో ముగ్గురూ కూర్చున్నారు. వసంత మధ్య మధ్య కబుర్లు చెపుతూ, ఇద్దర్నీ నవ్విస్తోంది

'అమ్మాయి వసంతా, గదిలోకి వెళ్ళి, కోటు జేబులో పెన్ ఉంటుంది గాని తీసుకురా...' ఉమాపతి పురమాయించాడు.

'అట్లా అవుతే నేను వచ్చేదాక మీరేమీ తినకూడదు...' వసంత సోఫాలోంచి దిగింది.

'ఏమిటి మరీను..., చిన్న వ్వార్నై పోతున్నారు !...'

'అదుగో నేను చూస్తున్నా... మీరేమీ తినకూడదు' వసంత వెనక్కు వెనక్కు చూస్తూ వెళుతోంది.

'ఎప్పుడూ ఆ కూపంలో పడివుండాలంటే విసుగుపుడుతోంది. రేపు సాయంత్రం యెక్కడకైనా షికారుకు పోదాం...' ఉమాపతి అన్నాడు చప్పున.

'ఎన్నడూ లేనిది ఇవ్వాళ మీరే షికారుకు వెళదాం అంటున్నారే,...' నవ్వుకుంటూ సుజాత, భర్త మొహంలోకి చూసింది.

'అమ్మా, నాన్న చాలా మంచి వాడే...'

'అయితే నేను?...'

'నువ్వూ మంచిదానివే. .'

'బాగానే వుంది...'

'అదికాదే, నీకంటేకూడా నాన్న మంచివాడు...'

'ఎందుకు...'

'నాన్న బజారుకు తీసుకు వెళతాడు. కావలసిన వన్నీ కొనిపెడ తాడు...అందుకని...' వసంత యింకా యేవో చెపుదామని తాపత్రయ పడుతోంది.

'అయితే నేను నీకు నీళ్ళుపోసి మంచి పరికిణీ గౌను తొడిగి, మల్లెపూల జెడవేసి, నీకు కావలసిన వన్నీ వండి పెట్టి, చక్కగా బళ్ళోకి పంపిస్తున్నానే, మరి నా మాటో?...'

"అవుతే నాన్న కంటె నువ్వేమంచి దానివే అమ్మా..." వసంత గభాలున, తల్లి వళ్ళోకి దూకింది.

* * *

'ఎవరో వస్తున్నట్లున్నారు చూడు...' సుజాతలేచి ముందుకు వస్తోంది.

'నర్సేనే...'

తప్పు అట్లా అనకూడదు... 'నర్సు అత్తయ్య' అనాలి...

'డాక్టరుగారున్నారండీ?' నర్సు గుమ్మంలోంచే అడిగింది.

'లేరు ఇప్పుడే వాకిట్లోకి వెళ్లారు లోపలికి రండి. అక్కడనుంచే మాట్లాడుతున్నారు..,'

'కాదండి తొందరగా వెళ్లాలి. వారొస్తే, డిస్పెన్సరీకి రమ్మనమని చెప్పండి...' నర్సు చరునవెళ్ళి పోయింది.

ఇంతలోనే ఉమాపతి వచ్చేశాడు.

'మిమ్మల్ని నర్సు కలవలేదూ?' సుజాత, ఉమాపతి వస్తూవుంటేనే ప్రశ్నించింది.

ఉమాపతి ఒక్కక్షణం నిర్విణ్ణుడై పోయాడు. 'నాకెక్కడా కలవలేదే... తప్పించుకున్నట్లు సమాధానం చెప్పాడు.

'ఇప్పుడే మీకోసం వచ్చిందే! మిమ్మల్ని రమ్మనమని చెప్పింది.'

'ఈ డిస్పెన్సరీ గోడవేకద.. తర్వాత చూసుకుందాం గానీ, మనీపర్సు మరిచే పోయాను...' ఉమాపతి పూర్తి చెయ్యకముందే సుజాత అందుకుంది.

'మీ జేబులోనే వుంది కాదండి...!

'మనిపర్సు అంటున్నాను...'

'పెన్...అదీ జేబులో నే వుంది...' వసంత అందుకుంది.

'ఏం మరిచెపోయానో కూడా మరిచిపోయాను...' ఉమాపతి చటుక్కున సోఫాలో కూలబడ్డాడు. కాని ఉమాపతి మనస్సంతా యింకో చోట పనిచేస్తోంది.

తన గుట్టు, సుజాతికి తెలియకూడదనిగట్టి ప్రయత్నంచేస్తున్నాడు. తన భార్య సంగతి తనకు పూర్తిగా తెలుసు. తనను అనుమానించేటంత తెలివి తేటలు లేవు. పైగా సంఘటనల్ని సంభాషణల్ని, సమన్వయ పరుచుకుని అర్థంచెప్పుకోగలంత చాక చక్యమూలేదు. పైపెచ్చు, తనే ఆమె ముందర కాళ్ళకి బంధాలు యెప్పటికప్పుడు వేస్తూ వున్నాడు. ఉమాపతికి యీ విధంగాతృప్తి.

డా.ఉమాపతి మానవప్రవృత్తుల్నిపట్టి మందులు వాడుతూవుంటాడు. ఇతరులను అర్థంచేసుకోవటానికి ప్రయత్నిస్తూ వుంటాడు. ఇతరుల మన స్తత్వం పూర్తిగా ఆకళింపు చేసుకుని, ఆ మనస్తత్వాన్ని, యితరుల ప్రయోజనాలకోసం తన ప్రయోజనాలకోసం వినియోగించుకుంటూ వుంటాడు. మానవ తత్వాన్ని తెలుసుకొనటానికి నిరంతరం యేవో చదువుతూ వుంటాడు. ఏవేవోపరిశోధనలు జరుపుతూ వుంటాడు. అతడు పెద్ద సైకాలజిస్టు.

తన భార్య మన స్తత్వం తనకు పూర్తిగా అర్థమయింది. అందువల్ల నే, నర్సు మీద అనుమానపడకండా వుండటానికి గల వాతావరణాన్ని సృష్టించుకుంటున్నాడు.

ఆ నాడు రాత్రి పదకొండయినా, ఉమాపతి యింటికిరాలేదు. సుజాత కళ్ల కాయలు కాచిపోతున్నాయి. తలుపు యేగాలికి చప్పుడైనా, తనభర్తే వస్తున్నాడని ఆదుర్దాగా వచ్చి చూస్తుంది.

గభాలున తలుపు తెరుచుకుని, ఉమాపతి లోపలికి వచ్చేశాడు. మెడకు చుట్టుకున్న స్టెతోస్కోపు తీసి గిరాటు పెట్టాడు.

'సుజీ! కాసిని మంచినీళ్ల ఇయ్యి...' ఎంతో ఆయాసంగా అన్నాడు ఉమాపతి.

'ఏమయిందండీ, ఇంత ఆలస్యానికి?' సుజాత విసుగ్గా అడుగుతోంది.

'ఇహ నేను రేపటినుంచి డిస్పెన్సరీకి వెళ్ళను. నా ప్రాణాలు పోతున్నాయి. రోజు కెన్నని ఈ కేసులు! వీటన్నింటిని చూస్తూ వచ్చేటప్పటికి ఈ వేళ అవుతోంది. వారం రోజుల్నుంచి నిద్రేమన్నా వుందా?' విసుక్కుంటున్నాడు ఉమాపతి తీవ్రంగా.

సుజాత యేమీ మాట్లాడలేదు. ఇంతచిరాకు ఈనాడు ఎందుకు కలిగిందో అర్థంకావటంలేదు.

తెల్లారి పదయినా భర్త ఇంట్లోనే కూర్చుని వున్నాడు.

'ఏమండీ...యివ్వాళ పగలుకూడా వెళ్ళరేమిటి ఆసుపత్రికి...' అంటూ సుజాత దగ్గరకువచ్చింది.

'ఎందుకు యీ బాధ. ఎంత సంపాదించినా మనకోసమేగద. కాసేపు మనం కులాసాగా కబుర్లు చెప్పుకోకపోయిన తర్వాత, ఏం

సంపాదిస్తే, ఏంచేస్తే యేం? నేను ఓ వారం రోజులుదాకా ఎక్కడికీ కదలను.

ముగ్గురూ కలిసి యేవేమిటో ఎడ తెరిపి లేకుండా చెప్పేసుకుంటు న్నారు.

ఇంతలోకి నర్సురానేవచ్చింది.

'సిస్టర్ వచ్చిందండి' సుజాత చెప్పింది.

సోఫాలోంచి కదలకుండానే, ఇవ్వాళ డిస్పెన్సరీకి రాను... కొంచెం బిగ్గరగా చెప్పాడు,

తల వంచుకుని నర్సు వెళ్లిపోయిలది.

'పాపం చిన్న మొహంచేసుకుని వెళ్లిపోయింది. పోనీ లేచివెళ్ళి చెపి తేయేం? ఇంతలో యేం నామర్దా?' సుజాత నాలిక కరుచుకుంది.

'దాని మాటెత్తకు నాదగ్గర. జీతం దండగ. ఒక్క పని సరిగ్గా చెయ్యదు. పనిలోంచి తీసేద్దామని చూస్తున్నా...' ఉమాపతి నిరామయంగా అక్కడ యేదో పుస్తకాన్ని లాక్కున్నాడు.

మీ మాటలన్నీ తమషాగావున్నాయే...నర్సును ఉద్యోగంలోంచి తీసెయ్యటం ఎందుకండీ!...

'అదిసరేకాని, మనం యేదైనా వూరు వెళ్ళి కొన్నాళ్ళుండి వద్దా మేమిటి...?' ఉమాపతి హఠాత్తుగా లేచి అన్నాడు.

మీ మగవాళ్ళు యేది తలుచుకుంటే అది క్షణంలో చేసిపారేస్తారు. అయినా ఎప్పుడూ లేదు యిలాంటి అలవాటు. ఇవ్వాళ యిట్లా మొదలు పెట్టారే! సుజాత చనువంతా వుపయోగించుకుంటోంది.

'నాన్నా...వూరికి ఇప్పుడెళ్ళొద్దు నాన్నా. రేపు బొమ్మలపెళ్ళి. వసంత తండ్రి చొక్కాగుండీలు సవరిస్తూ, నాట్యమాడుతోంది.

'అట్లాగే, యీ బొమ్మలపెళ్ళి అయిన తర్వాతే వెళదాంలే...' ఉమాపతి వెంటనే సమాధానంగా ఒప్పుకున్నాడు.

'నేను అడుగుతుంటే నేమో యేమీ చెప్పవు. ఎట్లాగో వుంటు న్నావు. ఎందుకు చెప్పు...' రెట్టించి అడిగాడు ఉమాపతి.

'ఇదొకటి మొదలుపెట్టారు బాగానే వుంది. ఎట్లా వున్నానో చెప్పమంటే చెప్పరు. నా కేమీ మార్పు కనిపించటంలేదు. మీలో యేమన్నా మార్పువస్తే, నేను ఎట్లాగో వున్నాననుకుంటున్నారా ఏం?...' సుజాత యెంతో అమాయకంగా నవ్వింది.

ఉమాపతికి వెన్నుమీద కొట్టినట్టయింది. అమాయకురాలు కూడా. అనుకోకండా, తనకొక రకపు మనస్తత్వం చెప్పిందని సంతోషపడ్డాడు.

'ఇది మరీ బాగుంది. నేను నిన్ను అడుగుతుంటే నువ్వు నామీదే పెడుతున్నావు...' ఉమాపతి వెకిలిగా నవ్వాడు.

'ఊరికే అన్నానండి...' సుజాత యింకా అమాయకంగా భర్త వంక చూసింది.

ఉమాపతి మనస్సు తృప్తిపడింది,

వసంత బొమ్మలపెళ్ళి చేస్తూ మురిసిపోతోంది.

సంధ్యారుణరేఖలు, మందారపువ్వు రేకులులాగా విచ్చుకుని, ఎఱ్ఱటికాంతిని విరజిమ్మేస్తున్నాయి. సూర్య బింబం పెద్దదిగా కనిపిస్తోంది. సూర్యుని నిష్క్రమణకోసం, ఆకాశంలో చంద్రుడునిరీక్షిస్తున్నాడు. నర్సు సిల్కుచీరెకట్టుకుని, గులాబివన్నె జాకెట్టు మీదికి, లేత వూదారంగుపమిట

సవరించుకుంటుంటే సుజాత యెంతో విడ్డూరంగా చూస్తోంది. నర్సుతో యేవో లోకాభి రామాయణం మాట్లాడుతూ కూర్చుంది సుజాత.

'నాకు టైమయింది వెళతాను' అని లేచింది నర్సు.

'కాఫీ పెట్టేశాను. ఇప్పుడే తీసుకొస్తాను' అని సుజాత లోపలికి వెళ్ళింది.

'ఏమిటి చూస్తున్నావు?...' నర్సు వసంత బుగ్గ గిల్లుతూ అన్నది.

'ఈచీర చాలాబాగుంది... మాఅమ్మ ఇలాంటిచీరె కట్టుకోనే కట్టు కోదు...' వసంత కొంచెం ముందుకువచ్చి, నర్సు వైపుకు అట్టే చూస్తోంది.

'అవుతే చెప్పు! మీఅమ్మ బాగుంటుందా, నేను బాగుంటానా!' నర్సు నవ్వులు కురిపించింది.

'మాఅమ్మే బాగుంటుంది'... వసంత మొహంలో కొంత మార్పు వచ్చింది.

సుజాత కాఫీ తీసుకుని వస్తోంది.

'అదిసరేగాని...ఈబొమ్మ యెంతబాగుందో చూడు. పెళ్లికూతురు బొమ్మ యేమీ బాగాలేదు. నేను బజారునుంచి నీకోసం, చాలా అంద మైన బొమ్మ తీసుకురానా?' నర్సు రెండు బొమ్మల్నీ చేతుల్లోకి తీసుకుని చూస్తోంది.

సుజాత కాఫీ, టేబుల్ మీద పెట్టేసింది.

'ఇప్పుడెట్లా... పెళ్లి అయిపోయిందిగా,రెండుబొమ్మల్నీ అమాం తంగా నర్సు చేతుల్లోంచి లాక్కుంది వసంత.

'పెళ్లయిపోతేయేమె...' వ్యంగ్యంగానవ్వి. వసంతను దగ్గరకు తీసుకుంది సుజాత.

నర్సువైపుకు ఓసారివోరకంటితో చూసి, రెండుబొమ్మల్ని, వళ్లో దాచుకుంది వసంత.

సుజాత, నర్సులు నవ్వుకుంటూ కాఫీ త్రాగుతున్నారు.

'అమ్మా! నాన్న వచ్చాడే...' ఓ గంతువేసి, తండ్రిదగ్గరకు వెళ్లింది వసంత.

ఉమాపతి సరాసరి వస్తూనే సిల్కుచీరెను చూసి కొంచెం వెనక్కు తగ్గాడు.

'మన సిష్టరండీ...ఇవ్వాళ చీరెతో వచ్చింది...'మామూలుగానే సుజాత అంది.

ఉమాపతి కళ్లు చెదరిపోయినాయి. నర్సు ప్రక్కకుతిరిగి నుంచుంది, 'మీకు కూడా కాఫీ తెస్తాను కూర్చోండి'అంటూ సుజాత లోపలికి వెళ్లింది. నర్సుకు, ఉమాపతికి, మధ్యన వసంత రెండుబొమ్మల్నీ పట్టుకుని నుంచుంది. ఉమాపతి కన్నార్పకుండా నర్సుమొహంలోకి చూస్తున్నాడు. నర్సు నవ్వింది. ఉమాపతి కనుసంజ్ఞ చేశాడు.

'ఏమిటినాన్నా, నర్సుఅత్తయ్య వంక అట్లా చూస్తావు?' వసంత, తలెత్తి తండ్రి కళ్లల్లోకి చూసింది.

నీకు యివ్వాళ బజారునుంచి ఓ క్రొత్తపరికిణా తెచ్చాను.

'అదుగో అమ్మ కాఫీ తీసుకువస్తోంది...'

'వస్తానండి...' నర్సు అడుగులు సాగించింది.

వాకిటి గుమ్మందాక సుజాత సాగనంపటానికి వెళ్లింది.

'ఈ బొమ్మల్ని యిట్లా యెంత సేపు వళ్లో పెట్టుకు కూర్చుంటావు. పెట్టెలో పెట్టుకో'—ఉమాపతి, మెల్లిగా వసంతను, ఒళ్లోంచి దింపాడు.

'అమ్మా నర్సుఅత్తయ్య మంచిది కాదే--నాన్నని చూసి ఎగతాళి చేసి నవ్వింది.,.మరేమొ నన్ను...'

'నేను కోపడతానులే...నువ్వెళ్ళి పెట్టెలో పెట్టుకో'...సుజాత మెల్లిగా వసంత వీపు మీద చరిచింది.

'అబ్బ! యీ వేడి కాఫీ తాగితే ఒకటే చెమటలు...' మొహమంతా తుడుచుకుంటున్నాడు ఉమాపతి.

'మేము చల్లారిన కాఫీ తాగామేమిటి? మాకే చెమటలూ లేవే...' సుజాత వక్కపొడిసీసా అందిచ్చింది.

ఇంతలోకి వసంత వచ్చేసింది.

'ఇక యివ్వాళిటికి యెక్కడికీ లేదుగా. నిశ్చింతగా నిద్ర పోవచ్చు...'సుజాత ఓనిట్టూర్పు విడిచింది.

పది అప్రాంతాల ఓసారి డిస్పెన్సరీకి వెళ్ళి వచ్చేస్తాను. ఉమాపతి అన్నాడు:

సుజాత యేమీ సమాధానం చెప్పలేదు.

రాత్రి పదకొండున్నరకు ఉమాపతి యింటికి వచ్చి గాఢంగా నిద్రపోయాడు.

అవ్యాజమైన ప్రేమకు, తెంపుకోలేని మోహానికి తీవ్రంగా సుర్షణ జరుగుతోంది ఉమాపతి మనస్సులో.

సుజాత మనస్సులో చెలరేగుతున్న భావాలకు, అమాయకత్వం మాటి మాటికి అడ్డువచ్చి, ఒక రూపును ఇవ్వకండా చేసేస్తోంది. కాని సుజాత ఆలోచించటం మానెయ్యలేదు. సుజాత మనస్సు శాంతి పడలేదు. ఆమె హృదయంలో యెక్కడో యేదో కలుక్కు మంటోంది. అది

యేమిటో తెలుసుకో లేకుండావుంది. తన భర్తను గురించి తనకు పూర్తిగా తెలుసు.

సుజాతకు యెందువల్లనో అదోరకపు ఆలోచన బయలుదేరింది.

'సుజీ : మనం యివ్వాళ బజారువెళదాం. మంచి సిల్కుచీరె కొందాం. నువ్వు సిల్కుచీరె కట్టుకుంటే చాలా బాగుంటావు. ఏమంటావు?' ఉమాపతి, కళ్లార్పకుండా సుజాత వైపుకు చూస్తున్నాడు.

'నాన్నా...నువ్వు అత్తయ్య కట్టుకున్న చీరెలాంటిది కొనాలి. ఆ చీరె చాలా బాగుంది...' వసంత చప్పున అందుకుంది.

'పాపకు నిన్ను కూడా తీసుకుపోతానులే...' ఉమాపతి, ధైర్యం చెప్పాడు.

సుజాత పక్కాక్షణం వణికి, ముందుకు వచ్చేసింది, అట్లాగే బజారు వెళదాం అంటూ.

సుజాత సిల్కుచీరె కట్టుకుంటే ఎంతో అందంగా కనిపించింది, అద్దంలో చూసుకుంటే తనకే ఆశ్చర్యం వేసింది.

సుజాత పెద్ద నిట్టూర్పు విడిచింది. మనస్సంతా కలవరపడి పోతోంది. అప్పటికే వసంత నిద్రపోయింది. ఉమాపతి ఇంకా ఇంటికి రాలేదు. అప్పటికప్పుడు సుజాతకు యేవేవో ఆలోచనలు అలలులాగ బయల్దేరి, పైకి క్రిందకు వూగి, మటుమాయ మైపోయినాయి. పిచ్చి దాని లాగ అటూ యిటూ తిరుగుతోంది. భర్తరాగానే, తానేమిటో గట్టిగా అడగాలనుకుంది. వుక్రోషం కంటె కళ్ళ నీళ్ళే ముందొచ్చాయి. గడియారం వంక, వాకిటి తలుపువంక, ఎడతెరపిలేకుండా చూస్తోంది. రెండూ కూడా సుజాతకు అసంతృప్తినే కలిగించినాయి. కొంచెం కోపం కూడా వచ్చింది. గభాలున వీధితలుపుదగరకు వెళ్ళి గడియ వెయ్యబోయింది. తలుపు తెరుచుకుంది.

వాకిట్లో బండీ ఆగివుంది. బండీ మనిషి సహాయంతో డాక్టరు ఉమాపతి మెల్లిగా వస్తున్నాడు. సుజాత నివ్వెరపోయింది.

ఎంతో వోపిక వచ్చినట్లనిపించింది. గబగబ ముందుకు వెళ్ళి, భర్తవంక చూసింది. భర్త తలకు కట్టుకట్టివుంది. గజగజ వణుక్కుంటూ లోపలికి తీసుకు వెళ్ళింది ఉమాపతిని.

'తలకాయ పగిలిపోతోంది. నువ్వు యిక్కడ భయపడతావేమో అని, యిప్పుడొచ్చాను. అసలు యీ రాత్రి రావాలసిన పనికాదు...' ఎంతో కష్టంమీద మాటలు పెగులుతున్నాయి.

సుజాత నోట మాట లేదు, తల గట్టిగా పట్టుకుని, అద్దుతోంది' ఆమె మనస్సంతా పరిపరి విధాల పోతోంది. సుజాత అలిసిపోయి మంచం మీద సొమ్మసిల్లింది.

మర్నాడు తెల్లారేటప్పటికి ఉమాపతి తలనొప్పి ఎగిరిపోయింది.

ఆ రోజల్లా, యెంతో హుషారుగా వున్నాడు.

సాయంత్రం ఆరు దాటుతూ వుండగా, ఉమాపతి, ఎవరో స్నేహితుడు వస్తే, అతనివెంట వాకిట్లోకి వెళ్ళాడు.

సుజాత, లోపల్నుంచి, వాకిట్లోకి వెళుతున్న భర్తను మాత్రం చూసింది.

'అమ్మా, నాన్న, యెక్కడికి వెళుతున్నాడే,?' వసంత గుచ్చి అడిగింది. సుజాత మాట్లాడ లేదు.

'మళ్ళీ ఎప్పుడు వస్తాడే...'

'అన్నం ఉడికేటప్పటికి వచ్చేస్తారు...'

'అవుతే, నాన్నా, నేను కలిసి అన్నం తింటామే...'

'నువ్వు అట్లాగే అంటూ వుంటావు. నాన్నగారు వచ్చేటప్పటికి నువ్వు నిద్రపోతూ వుంటావు రోజూను...'

'మరీ అంత ఆలస్యంగా వస్తే నేమిటి...' మూతి బిగించుకుంది వసంత.

సుజాత యేమీ మాట్లాడలేదు.

'అమ్మా, నేను కూడా కూరలు తరుగుతానే...'

'నువ్వక్కర్లేదు లేవే...రాత్రిపూట కూడాను...చెయ్యికోసుకుంటావు'...సుజాత వారించింది.

సుజాత యిట్టె లోపలికి వెళ్ళగానే వసంత, తరగటం మొదలు పెట్టింది. ముక్కలమధ్య చిటికినవేలు కత్తిపీటకు కనిపించలేదు.

'అమ్మా' అని కెవ్వున అరిచింది వసంత.

'నేను చెపితే విన్నావూ. నువ్వుకూడా వేధించుకు తిను...'గదిలోకి తీసుకు వెళ్ళి, మందువేసి కట్టుకట్టింది.

నెత్తురు చూసి బావురుమంది.

'కట్టుకట్టినా, నెత్తురు ఆగటం లేదు..' సుజాతకు. ఏమీ తోచటం లేదు. అమాంతం డిస్పెన్సరీకు బయలుదేరింది.

డాక్టరు ఉమాపతి డిస్పెన్సరీలో లేడు. వెళ్లబోతున్న కంపౌండర్ని ఆపి, వసంత వేలుకు కట్టుకట్టించింది. బరువైన హృదయంతో, మెల్లిగా వసంతను చేరతీసుకుని, యింటికి బయలుదేరింది. నాలుగు అడుగులు వెయ్యంగానే, బంయ్ మంటూ కారొచ్చి, డిస్పెన్సరీ దగ్గర ఆగింది. డాక్టర్ ఉమాపతి కారులోంచిదిగాడు. కారులోంచి బైటకువచ్చిన మరొక వ్యక్తిని కూడా తన కళ్లారా చూసింది. సుజాత. వసంత, సిల్కుచీరె

గుర్తుపట్టి యేదో అనబోతుంటె, వసంత నోరును గట్టిగా మూసేసింది సుజాత. శరీరం అంతా దహించుకుపోతోంది. తనకు తెలియకండానే యింటికి వచ్చి పడింది

డాక్టర్ ఉమాపతి ఇంకో తాళం చెవితో తాళం తీశాడు. లోపలికి వెళ్లాడు. వెనకాలే నర్సు నాజూకుగా అడుగులు వేసుకుంటూ వెళుతోంది. టైము చూసుకుని, ఉమాపతి గాభరాగా యింటికి బయలుదేరాడు.

'ఇవ్వాళ యేనాటకం ఆడతారు?' నర్సు నవ్వుతూ అడిగింది.

అప్పటికి యేది తడితే అదే... దానికి ముందర ప్లాను కూడా వెయ్యాలేమిటి? వీడ్కోలు పదాలు ప్రతిధ్వనించినాయి.

లోపలికివస్తూనే, 'నేను చెపితే నువ్వు వినవు. ఈ వూరు వదిలి పెట్టి యెక్కడికైనా కొన్నాళ్లపాటు పోదాం, ఇక్కడున్నంత వరకు, నాకీ రోగిష్ఠి వాళ్ళ చెర తప్పదు... ఎంత పెళ్ళగిలి వద్దామనుకున్నా, తీరా బయలుదేరే వేళకు యెవరో ఒకరు రావటమే...' చూస్తూ చూస్తూ వాళ్ళను ఎట్లా వదలి పెట్టి వచ్చేది? నా ప్రాణం విసిగిపోతోంది' నీ కెట్లావుందో నాకు తెలీదు గాని...' కంఠోపాఠంగా, ఉపోద్ఘాతం ప్రారంభించాడు ఉమాపతి.

దెబ్బతిన్న హృదయం కొంచెం సేపటి దాక యేమీ ఆలోచించ లేకపోయింది. ఓ మూల హృదయం దహించుకు పోతోంది. ఆవే శంలో యేమన్నా అంటే, యెట్లాబెడుస్తుందో యేమో అర్థం కావటంలేదు. చటుక్కున సుజాతకు ఏదో క్రొత్త ఆవేశం వచ్చింది. వెంటనే అద్దంలో మొహం చూసుకుని, భర్త దగ్గరకు వచ్చింది.

'డాక్టరు వృత్తి అన్న తర్వాత తెరిపి యెక్కడుంటుంది. ఎట్లా గోట్లా కాలం వెళ్ళ బుచ్చుకు పోవాలసిందే కాని, వాళ్ళ పీడ వదలించు

కుందామని మనం యేవూరైనా వెళ్ళికూర్చుంటే, వాళ్ళ మనస్సు యెంత క్షోభపడుతుందో ఆలోచించారా యేమైనా ? సుజాత వెతుక్కోకుండా జవాబు చెప్పేసింది.

ఉమాపతి లోపల లోపల యెంతో సంతోషించాడు.

'ఏమిటో యీ గొడవ నాకేమీ అర్థం కావటం లేదు...' ఉమాపతి నిద్రపోతున్న వసంత దగ్గరకు వెళ్లాడు.

వసంత మొహం వరకు ముసుగు పెట్టుకుని గురకలు తీస్తోంది. 'ప్రక్కచూడంగానే యిట్టే నిద్రవచ్చేస్తుంది... పిచ్చిపిల్ల, పగలల్లా యేమిటో కబుర్లు చెపుతూనే వుంటుంది'. ఎంతో ఆప్యాయంగా వసంత మొహంలోకి చూస్తూ అన్నది సుజాత.

ఉమాపతి మత్తు నిద్రపోతున్నాడు. రెండు గంటలు కొట్టారు. కళ్లు జ్యోతుల్లాగ వున్నాయి. వళ్ళంతా వేడి ఆవుర్లుకప్పేసినాయి. సుజాత దొడ్డితలుపు తీసి వెన్నెల్లోకి వెళ్లింది.

మర్నాడు మధ్యాహ్నమే డాక్టరు ఉమాపతి హడావిడిగా యింట్లోంచి వెళ్లిపోయాడు. సుజాత వెనకాలే గుమ్మందాక వచ్చింది. వెనక్కు చూడకుండానే ఉమాపతి ముందుకు సాగిపోయాడు. డిస్పెన్సరీ తలుపులు బార్లగా తెరుచుకుని వున్నాయి. చకచక అడుగులు వేస్తూ సరాసరి తన గదిలోకి వెళ్ళిపోయాడు. అప్పటికే వచ్చి వున్న నర్సు కుర్చీలో కూర్చుని ఏమిటో రాసుకుంటోంది. ఉమాపతిని చూసి చప్పున లేచి నిలబడింది.

'నేను క్షమాపే అనుకొంటున్నా' నర్సు చనువుగా కొంచెం ముందుకు వచ్చింది.

ఉమాపతి ఒక్క క్షణం మౌనం వహించాడు.

'ఏమయింది...?' మళ్ళీ ప్రశ్నించింది.

'ఇంకా యేమీ అనుకోలేదు...' ఉమాపతి ముక్తసరిగా అన్నాడు.

'ఎన్నాళ్లు మరి...మందులు మన దగ్గర వున్నాయిగదా అని అశ్రద్ధ చేస్తున్నట్లు కనిపిస్తోంది......'

ఉమాపతి తలెత్తి ఓసారి నర్సు మొహంలోకి చూశాడు.

'లోకం యేమనుకుంటుందా అని ఆలోచిస్తున్నా...' ఉమాపతి దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

'ఇప్పుడు యేమనుకుంటోందో యేమన్నా ఆలోచించారా...' నర్సు కొంచెం తీవ్రంగానే అంది.

'ఇప్పుడనుకోవటం వేరు...'

'అయితే మీరు నాకుచేసిన వాగ్దానాలు...నన్ను మధ్యస్తంగా వదిలేయటమేనా?' కొంచెం బింకంగా అంది.

'నిన్ను ప్రేమించి నిన్ను వెంటాడుతున్న వాడిని నువ్వు వదిలెయ్యాటంలా?.

'అయితే మీరు, ఆశేఖర్‌ను పెళ్ళి చేసుకోమంటారు...అంతేనా...' ఎంతో కోపంగా ముందుకువచ్చింది నర్సు.

'అమ్మయ్య, నిజస్వరూపం బైటపడింది...నేను యిందాకటినుంచి అంటున్న వన్నీ నిజమే అనుకుంటున్నావా? నేను వేసినప్లాను చెప్తాను విను' మెల్లిగా నర్సు చెయ్యి పట్టుకుని సోఫాలోకి లాగాడు ఉమాపతి.

'నాకు చాలా భయం వేసింది మీ మాటల ధోరణిని చూస్తుంటే...' నర్సు బరువైన గుండెను యెంతో తేలికచేసుకుంది.

'నిన్ను వదిలి పెట్టి నేను ఒక్క క్షణం వుండలేను...మా మామ గారు మమ్మల్ని రమ్మనమని వుత్తరం వ్రాశారు. నువ్వు, పిల్ల వెళ్లండి అని అన్నాను. మీరుకూడా రావాలంటూ పట్టుపట్టింది. అయితే యిప్పుడు కాదు, తర్వాత అందరం కలిసి వెళదాంలే, అంటూ యేదో చెప్పేశాను. ఈ మాట మీద వుండిపోతుందో ఏమో అర్థం కావటంలేదు. పుట్టింటికి వెళదామని వుంది కాని నేనుకూడా వెళ్ళిపొమ్మని గట్టిగా చెపుతే యేమైనా అనుమాన పడుతుందేమో ! అని ఒక భయం. పోనీ వెళ్ళద్దని చెప్పానో చటుక్కున వుండిపోతుందేమో ఈ అమాయకత్వంకూడా ఒక్కొక్కప్పుడు ప్రాణాలు తీసేస్తూవుంటుంది. ఇక్కడనుంచి యెట్లాగైనా వెళ్ళిపోతే తర్వాత జరగవలసిన కార్యక్రమం అంతా ఆలోచించి సిద్ధంగా వుంచాను' ఆలోచనగా నర్సు మొహంలోకి చూశాడు ఉమాపతి.

'తర్వాత ఏం చేద్దామంటారు?' ఆదుర్దాగా అడిగింది నర్సు.

'ముందు పుట్టింటికి పంపే ఆలోచన చూడు. తర్వాత సంగతి చెపుతా నేను...'ఉమాపతికి ఆలోచన తెగటం లేదు.

'ఆడవాళ్లకు పుట్టింటికి వెళ్లటం అంటే సహజంగా ఆనందం.'

మీరు గట్టిగా వెళ్ళమని చెప్పండి. తర్వాత రెండుమూడు రోజులలో నేనూ వస్తాను అనండి చూద్దాం...' నర్సు సలహాగా అన్నది.

'అంతకంటె నాకూ యే విధమైన ఆలోచన పోవటంలేదు... ఉమాపతి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

'మీ సైకాలజీ అంతా ఉపయోగించండి...'

'దానిమీదే ఇంత వరకు నెట్టుకొస్తున్నా 'సరే గభాలున ఉమాపతి గదిలోంచి బైటకు వచ్చేశాడు.

'అమ్మా నాన్న వచ్చాడే..' వసంత గంతులు వేసుకుంటూ తండ్రి దగ్గరకు వెళ్ళింది.

లోపలవున్న సుజాత, కళ్ళ తుడుచుకుని, చిరునవ్వు పైకి తెప్పించుకుంటూ వచ్చేసింది.

'ఏం యివ్వాళ పెందరాళే వచ్చేశారు. రోగులు యెవరూ వెంటపడలేదా...నవ్వుతూనే అడిగింది సుజాత.

'నాకు డాక్టరు కావాలసి వచ్చింది యీ రోగాలన్నీ నయం చేసేటప్పటికి...' నీరసంగా సోఫాలో కూలబడ్డాడు ఉమాపతి.

ఉమాపతి కళ్ళు చింతనిప్పుల్లాగ వున్నాయి. శరీరం అంతా దహించుకుపోతోంది, గుండె దడదడ కొట్టుకుంటోంది.. హృదయం ఎంతో బరువుగా వుంది. మనస్సు పనిచెయ్యటం మానేసింది. ఉమాపతి ఇప్పుడు డాక్టరు కాదు. ఒక రోగి. అతని కళ్ళల్లో ఒకటే స్వరూపం నిలకడగా నిలిచి పోయినట్లనిపిస్తోంది.

'ఏమిటి...అట్లాకూర్చున్నారు ?' సుజాత మొహంలో యెంతో మార్పు క్షణంలో వచ్చేసింది.

ఉమాపతి, సుజాత వైపు చూడలేదు.

సుజాత గభాలున లోపలికి వెళ్ళింది.

'సుజీ! సుజీ!' రెండుసార్లు పిలిచాడు ఉమాపతి. వసంత వచ్చింది ఇంతలోకి.

సుజాత మొహం కడుక్కుని, పొర్లు కొస్తున్న దుఃఖాన్ని దిగ మింగుకుంటూ లేని సంతోషాన్ని తెచ్చుకొని మెల్లిగా ఉమాపతి దగ్గరగా కూర్చుంది.

ఒక్క క్షణం ఎవ్వరూ మాట్లాడలేదు.

'ఎందుకు అమ్మను పిలిచావు? అమ్మవచ్చిందిగా మాట్లాడవే...' వసంత, తండ్రి చెయ్యిపట్టుకుని గుంజుతోంది.

'మీ ప్రయాణం మాట ఏమనుకున్నారు?...' ఉమాపతి నెట్టుకొస్తున్న శ్వాసను బలవంతాన ఆపాడు

'మేము అనుకునేదేమిటి ఇంతకీ మీరు రావటం లేదేమిటి? చటుక్కున అంది సుజాత.

'నేనూ వస్తాను కానీ . . . '

'ఇప్పుడా నాకు చేతినిండా పనులున్నాయి. మీతో రేపే రావాలంటే వీలుపడుతుందో పడదో అని ఆలోచిస్తున్నా నేను వీలుచూసుకుని తప్పకుండా వస్తాను. ఏమంటావు. 'సుజీ? ఉమాపతి అదుర్దాగా, సుజాత కళ్లల్లోకి సమాధానం కోసం చూశాడు.

సుజాత యేమీ మాట్లాడలేదు.

'ఇంతకీ మీరు మాతో రారన్న మాట?'

'నువ్వు అట్లా అంటే నేను యేం చెప్పేది చెప్పు? మీ మాదిరిగా వెంటనే బయలుదేరాలంటే వీలుపడుతుందా? వెనకాముందూ చూసుకుని, నాలుగూ సద్దుకుని రావాలా? తర్వాత నీ యిష్టం '

సుజాత యేమీ సమాధానం చెప్ప లేక పోతోంది.

'అమ్మా! అమ్మా! మనం భట్టిప్రోలు మామయ్య దగ్గరకు యెప్పుడే వెళ్లేది?' వసంత గంతులు వేసుకుంటూ అడుగుతోంది.

వసంత చెయ్యి పట్టుకుని ముందుకు లాగి వళ్ళో కూర్చో పెట్టుకున్నాడు ఉమాపతి.

'ఏమంటావు సుజీ?'

'నేను అనేదేముంది? మీరు యెట్లా చెపితే అట్లాగే...'

'అవుతే మీ యిద్దరూ రేపు వెళ్ళండి. నేను రావటానికి, ప్రయత్నం చేస్తాను: ఊ! ' ఉమాపతి సుజాత కళ్లల్లోకి చూశాడు.

ఆరాత్రంతా భోరుభోరున ఏడుస్తూనేవుంది సుజాత. ఉమాపతి నిద్రపోయాడు. వసంత లేవలేదు. సుజాత గుండె దడదడ కొట్టుకుంటోంది. తనంతటతాను లేచి నిలబడలేక పోతోంది. తాను యిక్కడనుంచి వెళ్ళిపోయిన తర్వాత యేమవుతుందా అనే ఆలోచన పీడించేస్తోంది. ఆ ఆలోచనల్లో నలిగిపోతోంది సుజాత.

భళ్లున తెల్లారేప్పటికి, సుజాత కళ్ళు జ్యోతుల్లాగ ఎర్రబారినాయి.

వసంత అప్పటికప్పుడే లేచి పనులన్నీ పూర్తిచేసుకుని కాఫీ దగ్గర హాజరయింది.

సుజాత ముభావంగానే వూరుకుంది. మాటిమాటికి ఉమాపతి యేమిటో అంటూనే వున్నాడు కాఫీ తాగుతూ.

మామూలుగానే ఉమాపతి డిస్పెన్సరీకి వెళ్ళిపోయాడు. వసంత ప్రక్కింటివారింటికి వెళ్ళి కబుర్లు చెపుతోంది.

సుజాత తన పెళ్ళిఫోటో గోడమీద నుంచి తీసేసి, తన పెట్టెలో పెట్టుకుంది బట్టలన్నీ సద్దేసుకుంటోంది. తన కళ్లనిండా ఉమాపతే కన్పిస్తున్నాడు. గదంతా తారుమూళ్లాడుతూ ఎదో కనిపించని వస్తువు కోసం వెదుకుతోంది. కళ్లు బరువుగా వున్నాయి. అమాంతంగా వెళ్ళి మంచంమీద పడుకుంది. తనలోని శక్తిఅంతా క్షీణించి పోతోంది. పిచ్చిదానిలాగ, జుట్టు విరగబోసుకుని, అటూయిటూ చూస్తోంది, ఉత్తరాలతీగె

ఎదురుగా వేలాడుతోంది. గభాలున దాన్ని తీసి పాత ఉత్తరాలన్నింటిని చదువుతోంది.

చటుక్కున సుజాతకు ఒక ఆలోచన తట్టింది. చప్పున మంచం దిగి డ్రాయరు తీసి నాలుగు కాగితాలు పైన పెట్టింది, మళ్లీ కాగితాలన్నింటినిలోపల పెట్టేసి తలుపు వేసింది. సుజాత మనస్సు దేనిమీదా నిలకడగా వుండటం లేదు. మళ్లీ డ్రాయరుతీసింది ఇంతలోకి వసంత వచ్చి గుమ్మంముందర నిలబడింది.

కొంచెం విసుగ్గా, 'అమ్మాయి కాసేపుదాకా యిక్కడికి రాకే' అన్నది సుజాత. మారుమాటాడకండా వసంత తల వంచుకుని సావిట్లోకి వెళ్లిపోయింది.

ఇంతలోకి తలుపు నెట్టుకుంటూ ఉమాపతి లోపలికి వచ్చేశాడు.

'నాన్నా...మరేమొ, అమ్మేమొనే...' వసంత యేదో చెప్పబోతోంది.

'నీ పుస్తకం ఎక్కడ పెట్టావే? ' కసిరినట్లు అడిగింది. సుజాత..

'పెట్టెలో పెట్టుకున్నాలే ' వసంత మొహం చిన్న బుచ్చుకుని చెప్పింది.

సుజాత ఒకటి రెండుసార్లు భర్త దగ్గరకు వెళ్ళి యేదో చెపుదామనుకుంది. మళ్ళీ తటపటాయస్తోంది. ఆవేదన హెచ్చిపోతోంది, ఉక్కిరిబిక్కిరయిపోతోంది.

సరిగ్గా సాయంత్రం అయిదు గంటలకే యింటిగుమ్మం ముందరగా కారు వచ్చి నిలబడింది. ముందరగా సుజాత లోపలికివెళ్లి కూర్చుంది. తర్వాత వసంత వెళ్లింది. ఉమాపతి కూడా చివరకు లోపలికివెళ్లి కూర్చున్నాడు. ముగ్గురూ సరిగ్గా సర్దుకుని కూర్చు నేటప్పటికి రైలు

స్టేషను వచ్చేసింది. ముగ్గురూ ప్లాటుఫారం మీదికివెళ్లి నుంచున్నారు. సిగ్నలు ఇచ్చేశారు. నిప్పులు కక్కుకుంటూ రైలు అమాంతంగా వచ్చేసేస్తోంది. తనను కభళించటానికి వస్తున్న ఓ భయంకర భూతంలాగ కనిపిస్తోంది సుజాతకు. వసంత ఆనందానికి అంతులేదు. అమ్మా! రైలొస్తోంది రైలొస్తోంది అంటూ గంతులు వేస్తోంది. రైలు వచ్చేసి ఆగిపోయింది.

సుజాత హృదయావేదన ఆపుకోలేక పోయింది. పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, అమాంతంగా ఉమాపతి కాళ్లమీద పడింది.

'ఏమిటి మరీను ప్లాటుఫారం మీద.' కొంచెం విసుగ్గా ఉమాపతి, సుజాత రెండుచేతులు పట్టుకుని లేవతీశాడు. వసంత తల్లివంక, తండ్రి పాదాల వంక అట్టే చూస్తూ 'నాన్నా' అంటూ బావురుమంది. వసంతను దగ్గరకు తీసుకుని, పెట్టెలో యెక్కించాడు ఉమాపతి. గజగజ వణుకుతుంటూ సుజాత లోపలికి యెక్కింది.

'మీరు తప్పకుండా రండి 'సుజాత కొంచెం బిగ్గరగా అరిచింది

రైలు కెవ్వుమని కూసింది. సుజాత రెండు చెవులు మూసుకుంది.

రైలు మెల్లిగా కదిలింది.

సుజాతకు వళ్లంతా కంపరం యెత్తిపోతోంది. గభాలున లేచి తలుపు దగ్గరకు వెళ్లింది.

'తప్పకుండారండి ' తడబడుతూనే గట్టిగా అరిచింది.

ప్లాటుఫారం మీదనుంచి ఉమాపతి తలవూపాడు. రుమాలు కొంచెం కొంచెంగా కనిపిస్తోంది మనుష్యులు చిన్న వాళ్లయిపోతున్నారు. ఇంకా వంగి వంగి కిటికిలోంచి చూస్తోంది సుజాత. ప్లాటుఫారం బోర్డు మసకమసగా కనిపిస్తోంది. ఇంకా అట్లాగే చూస్తోంది.

'అమ్మయ్య! ఇప్పుడు, వెళ్ళిపోయింది కదా ' అన్నాడు ఉమాపతి.

నర్సు చిరునవ్వు నివ్వింది.

'అబ్బ! ఎంత హాయిగావుంది!' నర్సు చటుక్కున సోఫాలోకి వాలింది.

ఉమాపతి ఒక్క పెట్టున వులిక్కి పడ్డాడు. మామూలుగా ఇంట్లో. రాగానే, "అమ్మా నాన్న వచ్చాడే''అంటూ వసంత కాళ్ళకు చుట్టుకు నేది. ఉమాపతి కళ్లల్లో వసంత, సుజాతలు మెరిసి, అదృశ్యమయిపోయారుకి ఉమాపతి బుర్ర గిర్రున తిరిగింది. ఆ క్షణంలోనే తమాయించుకుని, ఎదురుగా వున్న సోఫాలోకి వాలాడు.

'ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నారు?' నర్సు చెక్కిళ్ల మీద చేతులు పెట్టుకుని వయ్యారంగా అడిగింది.

'ఏం లేదు...ఏంలేదు...' తత్తర పాటుగా అన్నాడు ఉమాపతి.

'ఇహ చెప్పండి...వాళ్లు వెళ్ళిపోయారుగా ' నర్సు ఉద్రేకంగా ఉమాపతి సోఫాలోకి వచ్చి కూర్చుంది.

ఉమాపతి శరీరంలోకి విద్యుత్‌లాగ వణుకు ప్రవేశించి మాయమై పోయింది.

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' నర్సు, ఉమాపతి మొహంలోకి మొహం పెట్టి అడిగింది.

జేబురుమాలతో మొహం అంతా తుడుచుకుంటూ ఉమాపతి, నర్సు మొహంలోకి చూశాడు. ఆ క్షణంలో నర్సు, సుజాత లాగ కనిపించింది.

నర్సు కళ్ళు పెద్దవిచేసుకుని, 'నేను, శాంతను, సుజాతను కాదు...' వికటంగా నవ్వింది.

'ఆ ' అంటూ త్రుళ్ళిపడ్డాడు ఉమాపతి.

గభాలున లేచినుంచున్నాడు. అటూఇటూ పచార్లు చేస్తున్నాడు.

నర్సుకు వెంటనే కోపంవచ్చేసింది. గభాలున సోఫాలోంచి లేచి నుంచుంది.

'ఏమాలోచిస్తున్నారో నాకు అర్థం కావటంలేదు. ఇటువచ్చి కూర్చోండి' గట్టిగా ఉమాపతి చెయ్యి పట్టుకుని సోఫాలోకి లాగింది.

ఉమాపతికి స్పృహవచ్చినట్లయింది. చెయ్యి సోఫా చివరిదాకా పోనిస్తూ, నర్సు మొహంలోకి చూసి నవ్వాడు. నర్సు కూడా పకపకా నవ్వేసింది.

'చెప్పు ఇప్పుడేం చెయ్యాలో?' ఉమాపతి నర్సు కళ్ళల్లోకి చూస్తూ, గిలిగింతలు పెట్టాడు.

'ఇందాకటి నుంచీ నేను అడుగు తుంది అదేగా?' నర్సు నడుం తిప్పుతూ ఊగింది.

'నేను వస్తానని చెప్పా—' పకపకనవ్వాడు ఉమాపతి.

'పాపం నిజం అనుకుని నమ్మింది గాబోలు ఇంకేం వుత్తరం వ్రాసెయ్యండి. ఇక మీరు ఇక్కడికి రావక్కర్లేదు. అక్కడే వుండండి. గడవటానికి మాత్రం నెలనెల మీకు మనియార్డర్లు వస్తూవుంటాయి అని '

'శాంతా! మనం యిక్కడుంటే లాభంలేదు. ఏ వూరైనా వెళ్లిపోవాలి. కనీసం కొన్నాళ్ళపాటైనా. తర్వాత చూసుకుందాం'

'మగవారైనా మీకెంత భయమండీ! ఇక్కడే వుంటే యేమో! ఇందులో దొంగతనం యేముందో!! ఓరోజు చూసి బాహాటంగానే చాటేసుకుందాం దాంతోసరి ఏమంటారు ?'

'అదెంత సేపు మన చేతులో వున్న పని కాని, ఎప్పుడైనా మన విషయం అనుమానిస్తుందేమో అని భయపడ్డాను సుమా' ఆశ్చర్యంగా ఉమాపతి నర్సు వంక చూశాడు.

'మీరు తక్కువవారా! ఎప్పటి కప్పుడు తగ్గట్టు నాటకం ఆడుతూనే వచ్చారు. మీరు కాబట్టి సరిపోయింది కాని యింకో శ్లైవరైనా అయితే యీపాటికి ఎంత రభస కావాలో అంతా అయేదే'

"అట్టే పొగడకులే " ఉమాపతి నవ్వుతూ లేచాడు.

ఈవినింగ్ డ్రస్ వేసుకుని వస్తా ఇంతలోకి యేమైనా పాటలు విను ' రేడియో స్విచ్ త్రిప్పి గదివైపుకు వెళ్లాడు ఉమాపతి.

గదితలుపు తియ్యటంతోనే తాను గదిలో కనిపించాడు. ఇంత పెద్ద అద్దం యిక్కడ యెందుకుందా అని వక్క క్షణం ఆలోచించాడు. వెంటనే తన పెళ్ళి ఫోటో అక్కడే వుండాలని జ్ఞాపకం వచ్చింది. నాలుగు గోడలు చూశాడు. ఏమిటో చిరాకుగా మంచందగ్గరకు వెళ్ళి, ఎడం చెయ్యిని కోటులోంచి లాగాడు. కుడి చెయ్యి కోటులోంచి వెనక్కు లాగుతూవుంటే, పరుపు, దిండు మధ్య, పొడుగాటి కాగితం కనిపించింది.

కళ్లు అ ప్రయత్నంగా ఆ కాగితం వైపునుంచి మరలినాయి.

కాగితాన్ని, ఆశ్చర్యంగా, కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు..

"ప్రియమైన హృదయేశ్వరునకు మీ పాదదాసి నమస్కారములు. నేను మీ దగ్గరకు వచ్చినప్పటినుంచి నన్ను యెంతో ప్రేమగాను చనువుగాను చూస్తూ వచ్చారు. నేను కూడా మిమ్మల్ని నా ప్రాణంతో సమానంగా చూశాను. మీకు యేమాత్రం సుస్తీచేసినా, నేను ఎంతో బాధపడే దాన్ని. ఈ విషయం మీకు కూడా పూర్తిగా తెలుసు. ఇంత అన్యోన్యంగా

వుంటున్నా కూడా, నేను చేసిన పాపం యేమిటో నాకు అర్థం కాలేదు. మీకు, నాకంటె నర్సు మీద ప్రేమ, యెందుకు కలిగిందో నాకు తెలేదు. మీ సుఖమే నాసుఖం. మీరు ఎప్పుడూ సుఖంగా వుండాలనే నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వుంటాను. నాకు అంత కంటె ఇంకో కోరిక యేమీ లేదు. అందువల్లనే, మీ మనస్సుకు బాధ కలుగుతుందేమో అని నా కళ్లారా చూసి కూడా, మీతో, నర్సు విషయం ఏమీ అనలేదు. నేను మీ ఆనందదానికి అడ్డు వస్తున్నానని తెలుసు. ముఖ్యంగా ఆలాంటి అడ్డం లేకుం వుంటుందనే వుద్దేశంతోనే, నేను పుట్టింటికి వెళ్లటానికి ఒప్పుకున్నాను. నాకు యేమీ చెయ్యటానికీ తోచక ఈవుత్తరం వ్రాస్తున్నాను. నేను చేసిన తప్పులేమైనా వుంటే క్షమించండి. నన్ను మరిచి పోకండి...నాఆశలన్నీ మీమీదే పెట్టుకున్నాను...ఈ వుత్తరం వ్రాసి మిమ్మల్ని బాధపెట్టదలచుకోలేదు. మీ సుఖమే నా సుఖం...పాప... వసంత యెప్పుడూ నాన్న ! నాన్న ! అని కలవరిస్తూవుంటుంది...నాకు దుఃఖం ఆగటం లేదు...నేను ఏమీ యింతకంటె వ్రాయ లేను...నన్ను క్షమించండి.

చిత్తగించవలెను,<br>మీ చరణదాసి,<br>సుజాత.

డాక్టరు ఉమాపతి గజగజ వణికిపోయాడు. వళ్ళంతా చెమటలు కమ్మేశాయి. పెదిమలు తడబడుతున్నాయి. చేత్తోపట్టుకున్నకాగితం గజగజ వణికిపోతోంది. వెచ్చటి ఆవుర్లు గుండెలో పొగలాగ చుట్టుకుపోతోంది. మొహం అంతా ముడతలుపడిపోతోంది. కళ్ళ లోంచి టపటప నీళ్లు కాగితంమీద పడ్డాయి.

'సుజాతా !...'హృదయంలోంచి. నర్సుగుండె బ్రద్దలయ్యేటట్లు పెద్దగా అరిచాడు ఉమాపతి. నర్సు అమాంతం సోఫాలోంచి ఉలిక్కి పడి లేచింది.

ఉమాపతి భయంకరంగా కనిపించాడు. ఉమాపతిని చూస్తూ నర్సు గజగజ వణికిపోతూ నిలబడింది. మరుక్షణంలోనే సుజాతా! సుజాతా! అంటూ వెర్రికేకలు వేసుకుంటూ ఉమాపతి సావిట్లోకి వచ్చేశాడు.

నర్సు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మెల్లిగా ఉమాపతి చేతులోని కాగితం తీసుకోబోయింది.

'ఛా! అవతలకు ఫో' అంటూ కసిరి కొట్టాడు ఉమాపతి. పిచ్చి వానిలాగ యిల్లంతా తిరిగేస్తున్నాడు. గభాలున పెట్టె పట్టుకుని, 'నేను వెళ్ళిపోతున్నా...నా సుజాత దగ్గరకు నేను వెళ్లిపోతున్నా...'అంటూ గబ గబ వాకిటివైపు వెళ్లిపోతున్నాడు ఉమాపతి.

'డాక్టర్...డాక్టర్...నేను...నేను' పెద్దగా ఆయాసపడుతూ డాక్టరు ముందుకు వచ్చి నుంచుంది నర్సు.

ఎడం చేత్తో, నర్సును వెనక్కు నెట్టేసి, డాక్టరు ఉమాపతి ముందుకు పారిపోయాడు.

(ఆంధ్రపత్రిక జూన్ 23, 1957)